సాక్షి
గుంటూరు
బుధవారం, 2, ఏప్రిల్, 2025





## శిలువ పాదయాత్ర

నాదెండ్ల: ఇర్లపాడు విచారణ ఆర్‌సీఎం సంఘం ఆధ్వర్యంలో మంగళవారం గ్రామం నుంచి కనపర్రు బాలయేసు పుణ్యక్షేత్రం వరకు శిలువ పాదయాత్ర నిర్వహించారు.



## రేపు బ్రహ్మంగారి ఆరాధన తిరునాళ్ల

కర్లపాలెం: ఏట్రవారిపాలెంలో పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి ఆరాధన తిరునాళ్ల గురువారం జరుగుతాయని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు మంగళవారం తెలిపారు.

## వైభవంగా ఆలయ వార్షికోత్సవం



నిజాంపట్నం: అడవుల దీవి గ్రామంలో వేంచేసియున్న అనంత సాయిబాబా మందిర 15వ వార్షికోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. బాబాకి అభిషేకాలు నిర్వహించి, ప్రత్యేక అలంకరణ చేశారు.

## న్యూస్‌రీల్

### ఏపీ పీ సెట్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం

ఏఎన్‌యూ(గుంటూరు): రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలలో డీపీఈడీ కోర్సులలో ప్రవేశాలకు నిర్వహిస్తున్న ఏపీ పీ సెట్‌కు ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ మంగళవారం ప్రారంభమైందని ఏపీ పీ సెట్ కన్వీనర్ ఆచార్య పి.పి.ఎస్.పాల్ కుమార్ తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి జూన్ 7వ తేదీతో గడువు ముగుస్తుందన్నారు. రూ.వెయ్యి ఆలస్య రుసుముతో జూన్ 11వ తేదీ వరకు, రూ.రెండువేల ఆలస్య రుసుముతో జూన్ 13వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఏపీ పీ సెట్ దేహదారుఢ్య పరీక్షలు జూన్ 23వ తేదీ నుంచి ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జరుగుతాయని పీ సెట్ కన్వీనర్ తెలిపారు.

### పాఠశాలలు ఒక్కపూటే పనిచేయాలి

గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లాలోని వివిధ ప్రైవేటు పాఠశాలలు ప్రభుత్వ ఆదేశాలను బేఖాతరు చేస్తూ ఇష్టానుసారం తరగతులను నిర్వహిస్తున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయని జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు, సీబీఎస్‌ఈ, ఐసీఎస్‌ఈ, ఐబీ యాజమాన్యాలు ఉదయం 7.45 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకే తరగతులను నిర్వహించాలని స్పష్టం చేశారు. ఇందుకు భిన్నంగా వ్యవహరించే పాఠశాలల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### వైద్యసిబ్బంది పోస్టుల మెరిట్ లిస్టు విడుదల

గుంటూరు మెడికల్:గుంటూరు డీఎంహెచ్‌ఓ కార్యాలయం పరిధిలో ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మాసిస్టు, డీఈఓ, ఎల్‌జీఎస్, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న వారి ఫైనల్ మెరిట్ లిస్టును విడుదల చేసినట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి తెలిపారు. ఫైనల్ మెరిట్ లిస్టును గుంటూరు.ఏపీ.జీవోవి.ఇన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామన్నారు. ఫైనల్ మెరిట్‌లిస్టులో ఆర్వోఆర్ ప్రకారం ఎంపికైన అభ్యర్థులకు కౌన్సిలింగ్ తేదీ తెలియజేస్తామని, వారు మాత్రమే ఒరిజినల్ సర్టిఫికెట్లతో సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు.

### గురుకుల ప్రవేశాలకు గడువు పొడిగింపు

గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల్లో ప్రవేశాలకు దరఖాస్తు గడువును ఈనెల 6 వరకు పొడిగించినట్లు జిల్లా కన్వీనర్ ఐ.జయప్రకాష్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 5, 6, 7, 8, తరగతుల్లో మిగిలి ఉన్న ఖాళీలతోపాటు జూనియర్, డిగ్రీ కళాశాలల్లో ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు https://aprs.apcfss.in సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

### 1,16,203 బస్తాల మిర్చి రాక

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 1,16,035 బస్తాల మిర్చి రాగా గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 1,11,203 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల సగటు ధర రూ.9,500 నుంచి రూ.14,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.10,000 నుంచి రూ.13,600 వరకు ధర లభించింది. తాలు రకం మిర్చికి రూ.4,500 నుంచి రూ.6,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 53,345 బస్తాలు నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఎ.చంద్రిక తెలిపారు.

### ఘనంగా రెడ్డి పేరంటాలమ్మ తల్లి ఆలయ పండుగ

నాదెండ్ల: మండలంలోని సాతులూరు గ్రామంలో కొలువైయున్న రెడ్డిపేరంటాలమ్మ తల్లి ఆలయ ప్రతిష్ట నిర్వహించి మంగళవారం నాటికి పదహారు రోజులు పూర్తయిన సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కమిటీ సభ్యులు పలువురు పీటలపై కూర్చుని పూజలు, అభిషేకాలు చేశారు. అమ్మవారికి పొంగళ్లు పొంగించి నైవేద్యాలు సమర్పించారు.

# అగ్నిపరీక్ష

- అగ్నిప్రమాదాల నియంత్రణ పెను సవాలే
- మూలనపడిన అత్యాధునిక వాహనాలు
- అరకొర సిబ్బందే గతి
- వేసవి నేపథ్యంలో అప్రమత్తత అవసరం

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): వేసవి నేపథ్యంలో అగ్నిప్రమాదాలకు ఆస్కారం ఎక్కువ. అయితే అందుకనుగుణంగా అగ్నిమాపక శాఖ అప్రమత్తంగా లేదనే వాదన వినిపిస్తోంది. ఫలితంగా ప్రమాదాలను నియంత్రించడం ఆ శాఖకు అగ్నిపరీక్షగా పరిణమించనుంది. దీనికి సర్కారు నిర్లక్ష్యమే కారణంగా కనిపిస్తోంది. ప్రజలూ అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక శాఖ అధికారులు చెబుతున్నారు.



అత్యసవర పరిస్థితుల్లో వినియోగించే పరికరాలు

### మిస్ట్ వాహనాలు నిరుపయోగం

ప్రస్తుతం గుంటూరు జిల్లాలో గుంటూరు, 1, 2, తెనాలి, మంగళగిరి, పొన్నూరు, వెలగపూడి, హైకోర్టు, సీఎం క్యాంపు కార్యాలయంలో ఫైర్ స్టేషన్లు ఉన్నాయి. వెలగపూడి, హైకోర్టు, సీఎం క్యాంపు కార్యాలయాల్లో ఉన్న అగ్నిమాపక దళాలు తాత్కాలికమే. వీటితోపాటుగా సీఎం కాన్వాయ్ విధుల్లో ఒక అగ్నిమాపక వాహనం ఉంటుంది. జిల్లాలో ఒక డీఎఫ్‌వో, ఇద్దరు ఏడీఎఫ్‌వోలు కలిపి 138 మంది సిబ్బంది ఉండాలి. మొత్తం ఏడు ఫైరింజన్లు, 5 మిస్ట్ బుల్లెట్లతోపాటు ఆధునిక అగ్నిమాపక పరికరాలు అందుబాటులో ఉడాలి. వీటిలో మిస్ట్ జీప్, మిస్ట్ బుల్లెట్ ఉన్నా నిరుపయోగంగా ఉన్నాయి. వీటి టైర్లు ఎండకు పాడైపోతున్న దుస్థితి. ఫైరింజన్ వెళ్ళలేని స్థితిలో మిస్ట్ వాహనాల ద్వారా మంటలు అదుపుచేస్తారు. వీటికి ఉండాల్సిన ట్యాంకర్లూ లేవు. మిస్ట్ జీప్, బుల్లెట్లు దుమ్ముపట్టుకుపోయాయి. ఫ్లోటింగ్ పంపు, చిన్నచిన్న సందుల్లోకి వెళ్ళే డీసీపీ ట్రాలీల నిర్వహణ సరిగా లేదు.

### ప్రత్తిపాడు కేంద్రం ప్రతిపాదన ఏమైంది?



జిల్లా అగ్నిమాపక శాఖ కార్యాలయంలో వాహనాలు

గుంటూరు రూరల్ గ్రామాల్లో ఏదైనా ప్రమాదం సంభవిస్తే సుమారు 20 నుంచి 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న గుంటూరు 1, 2 డిపోల నుంచి ఫైరింజన్ వెళ్ళాల్సిన దుస్థితి నెలకొంది. ఈ పరిస్థితిని నివారించాలంటే ప్రత్తిపాడు కేంద్రంగా ఫైర్ స్టేషన్ కోసం గతంలో ప్రతిపాదనలు చేశారు. అయితే ఇది ఇప్పటికీ మంజూరు కాలేదు. తాత్కాలిక ఫైర్‌స్టేషన్ అయినా ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది (ఫైల్)

### సిబ్బంది కొరత

గుంటూరు జిల్లాలో అగ్నిమాపక శాఖను సిబ్బంది కొరత వేధిస్తోంది. జిల్లాలో ఇద్దరు ఏడీఎఫ్‌లు ఉండాల్సి ఉండగా ఒకరే ఉన్నారు. స్టేషన్ ఆఫీసర్‌లు ముగ్గురు, లీడింగ్ ఫైర్‌మెన్ 21, డ్రైవర్‌లు 21, ఫైర్‌మెన్‌లు 67 మంది ఉండాల్సి ఉండగా.. ఫైర్‌మెన్‌లు 38 మంది మాత్రమే ఉన్నారు. 20 మంది హోంగార్డులతో ఈ స్థానాలు భర్తీ చేశారు. ఇంకా పది మంది సిబ్బంది కొరత ఉంది. ఇప్పటికే ప్రతిపాదనలు పంపినా సర్కారు నుంచి స్పందన లేదు. ఉన్న సిబ్బందికి సరైన తర్ఫీదు కూడా లేదు.



మూలనపడ్డ మిస్ట్ బుల్లెట్, టైర్లు

**జిల్లాలో ప్రమాదాలు ఇలా..**

| సంవత్సరం | ప్రమాదాల సంఖ్య | ఆస్తి నష్టం (రూ.కోట్లలో) | ఆస్తి విలువ రక్షించిన (రూ.కోట్లలో) |
|---|---|---|---|
| 2019-20 | 591 | 7.07 | 24.44 |
| 2020-21 | 513 | 2.83 | 23.29 |
| 2021-22 | 550 | 5.36 | 97.32 |
| 2022-23 | 626 | 6.09 | 37.01 |
| 2023-2024 | 636 | 102.40 | 90.16 |
| 2024-2025 ఫిబ్రవరి వరకు | 540 | 89.15 | 4.00 |

2021 నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి వరకు జరిగిన ప్రమాదాల్లో మొత్తం 44 మంది మరణించారు. 72 మందిని అగ్నిమాపక సిబ్బంది కాపాడారు.

### ప్రమాదాల నియంత్రణే లక్ష్యం



ప్రమాదాల నియంత్రణే లక్ష్యంగా పనిచేస్తున్నాం. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఎక్కువ ప్రమాదాలకు నిర్లక్ష్యమే కారణంగా కనిపిస్తోంది. గ్యాస్ సిలిండర్ల లీక్‌లు, షార్ట్‌సర్క్యూట్‌ల వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదం జరిగిన వెంటనే 101కు డయల్ చేయాలి. అగ్నిప్రమాదాల నివారణపై ప్రజలకూ అవగాహన కల్పిస్తున్నాం.

– ఎం.శ్రీనివాసరెడ్డి, జిల్లా, అగ్నిమాపకశాఖాధికారి

## ముగిసిన టెన్త్ పరీక్షలు

- 3 నుంచి స్పాట్ వాల్యూయేషన్
- గుంటూరు స్టాల్ బాలికోన్నత పాఠశాలలో మూల్యాంకనం
- ఏర్పాట్లు చేస్తున్న అధికారులు



గుంటూరు ఎడ్యుకేషన్: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ముగిశాయి. మంగళవారం సోషల్ స్టడీస్ పరీక్ష రాసిన విద్యార్థులు పరీక్ష కేంద్రాల నుంచి బయటకు వస్తూనే కేరింతలు కొట్టారు. పరీక్షలు ముగిసిన ఆనందంలో మునిగితేలారు. మంగళవారం జరిగిన సోషల్ స్టడీస్ పరీక్షను జిల్లా వ్యాప్తంగా 150 కేంద్రాల పరిధిలో 27,372 మంది విద్యార్థులు రాయాల్సి ఉండగా 27,222 మంది హాజరయ్యారు. డీఈఓ సీవీ రేణుక,, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ వెంకటరెడ్డి, ఫ్లయింగ్ స్క్వాడ్ల ఆధ్వర్యంలో పరీక్ష కేంద్రాల్లో తనిఖీలు జరిగాయి. జిల్లా అధికార యంత్రాంగం సహకారంతో టెన్త్ పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్లు డీఈవో సీవీ రేణుక ప్రకటించారు. జిల్లాలో ఒక్క మాల్ ప్రాక్టీసు కేసూ నమోదు కాలేదని చెప్పారు.

**ఈనెల 3 నుంచి స్పాట్ వాల్యూయేషన్**

ఈనెల 3వ తేదీ గుంటూరు నగరంపాలెంలోని స్టాల్ బాలికోన్నత పాఠశాలలో 3వ తేదీ నుంచి వారం రోజుల పాటు స్పాట్ వాల్యూయేషన్ నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. మూల్యాంకన విధుల్లో భాగంగా చీఫ్ ఎగ్జామినర్, అసిస్టెంట్ ఎగ్జామినర్, స్పెషల్ అసిస్టెంట్స్ విధులకు జిల్లా వ్యాప్తంగా 1,200 మంది ఉపాధ్యాయులను నియమించారు. గతేడాది పెదకాకానిలోని సెయింట్ జోసఫ్ హైస్కూల్లో నిర్వహించిన స్పాట్ వాల్యూయేషన్ ప్రక్రియను ఉపాధ్యాయ సంఘాల విజ్ఞప్తి మేరకు తిరిగి స్టాల్ బాలికోన్నత పాఠశాలకు మార్చారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు స్పాట్ వాల్యూయేషన్‌కు ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నామని డీఈవో సీవీ రేణుక తెలిపారు. విధులకు నియమితులైన ఉపాధ్యాయులందరూ గురువారం స్పాట్ వాల్యూయేషన్ కేంద్రంలో రిపోర్టు చేయాలని ఆదేశించారు.

# నేటి నుంచి జేఈఈ మెయిన్స్

- ఉదయం, మధ్యాహ్నం రెండు షిఫ్టులలో పరీక్షల నిర్వహణ
- అరగంట ముందు వరకే కేంద్రాల్లోకి అనుమతి
- విద్యార్థుల వస్త్రధారణ, ఆభరణాలపై ఎన్‌టీఏ ఆంక్షలు

గుంటూరు ఎడ్యుకేషన్: ఐఐటీ, ఎన్ఐటీల్లో ప్రవేశాలకు అర్హత కల్పించే జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) మెయిన్స్-2025 రెండవ సెషన్ పరీక్షలు బుధవారం నుంచి జరగనున్నాయి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12, తిరిగి మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పేపర్-1 (బీఈ, బీటెక్) ప్రవేశ పరీక్షలు కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) విధానంలో జరగనున్నాయి. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) సీబీటీ ఆన్‌లైన్ పరీక్షల కోసం ఉమ్మడి గుంటూరు జిల్లాలోని వివిధ ఇంజినీరింగ్ కళాశాలలతో పాటు నల్లపాడు, పేరేచర్లలోని అయాన్ డిజిటల్ జోన్‌లలో కేంద్రాలు ఏర్పాట్లు చేసింది. అడ్మిట్‌కార్డులు పొందిన విద్యార్థులు అందులో ఎన్‌టీఏ పొందుపర్చిన నియమ, నిబంధనలు క్షుణ్ణంగా చదవాలి.

- ఉదయం పరీక్షకు 7 గంటలకు, మధ్యాహ్నం పరీక్షకు ఒంటి గంటకు కేంద్రాలకు చేరుకుంటే మంచిది.
- అరగంట ముందు వరకే విద్యార్థులను కేంద్రాల్లోకి అనుమతిస్తారు.
- విద్యార్థులు సాధారణ వస్త్రాలను ధరించాలి. కాళ్లకు సాధారణ చెప్పులను ధరించాలి.
- పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులను తనిఖీ చేస్తారు.
- విద్యార్థినులు ఆభరణాలు తీసివేసి వెళ్లడం మంచిది.
- ఎన్‌టీఏ సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న అడ్మిట్ కార్డు కింది భాగంలో ఇచ్చిన ఒక బాక్సులో ఆన్‌లైన్ దరఖాస్తు సమయంలో అప్‌లోడ్ చేసిన ఫొటోను అంటించి, పక్కన ఉన్న బాక్సులో ఎడమ చేతి వేలిముద్ర వేయాలి. మూడో బాక్సులో పరీక్ష కేంద్రంలోకి వెళ్లిన తరువాత ఇన్విజిలేటర్ సమక్షంలో సంతకం చేయాలి.
- విద్యార్థి తమ వెంట అడ్మిట్‌కార్డుతోపాటు అటెండెన్స్ షీట్‌పై అతికించేందుకు మరొక పాస్‌పోర్ట్ సైజు ఫొటోను తెచ్చుకోవాలి. ప్రతి విద్యార్థి నుంచి బయోమెట్రిక్ హాజరు నమోదు చేస్తారు. ట్రాన్స్‌పరెంట్ వాటర్ బాటిల్‌తో పాటు బ్లూ, బ్లాక్ కలర్ బాల్ పాయింట్ పెన్ను తెచ్చుకోవాలి. దరఖాస్తు సమయంలో అప్లోడ్ చేసిన ఆధార్, పాన్ తదితర ఒరిజినల్ కార్డును విధిగా తీసుకెళ్లాలి.

## ఉపాధ్యాయ సమస్యలపై నేడు ఫ్యాప్టో నిరసన

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ అపరిష్కృత సమస్యలపై ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు కలెక్టరేట్ ఎదుట చేపడుతున్న నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఫ్యాప్టో జిల్లా చైర్మన్ కె.నరసింహారావు పిలుపునిచ్చారు. మంగళవారం కంకరగుంటలోని ఎస్టీయూ భవన్‌లో జరిగిన గుంటూరు జిల్లా ఫ్యాప్టో సన్నాహక సమావేశంలో నరసింహారావు మాట్లాడుతూ నిరసన కార్యక్రమంలో ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. 12వ పీఆర్సీ కమిటీని ఏర్పాటు చేయడంతోపాటు 30 శాతం ఐఆర్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. మిగిలి ఉన్న ఆర్థిక బకాయిలు, జెడ్పీ పీఎఫ్ రుణాలు, ఏపీజీఎల్ఐ క్లోజర్స్, సరెండర్ లీవ్స్ నిధులు విడుదల చేయడంతో పాటు సీపీఎస్, జీపీఎస్ రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని పేర్కొన్నారు. కారుణ్య నియమకాలు తక్షణమే పూర్తి చేసి, 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని వర్తింప చేయాలన్నారు. సమావేశంలో ఫ్యాప్టో జిల్లా సెక్రటరీ జనరల్ కె. వీరాంజనేయులు, డెప్యూటీ సెక్రటరీ జనరల్స్ యు.రాజశేఖర్‌రావు, డీకే సుబ్బారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎ. వేళాంగిణి రాజు, పి.ప్రసాద్, జిల్లా నాయకులు ఎం.సాంబశివరావు, ఎంపీ సుబ్బారావు, ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ఫ్యాప్టో భాగస్వామ్య పక్ష నాయకులతో నరసింహారావు, వీరాంజనేయులు తదితరులు

# గుండె ధైర్యం

- గుంటూరు జీజీహెచ్‌లో కార్పొరేట్ వైద్యం
- 25వేల చికిత్సలతో క్యాథ్‌ల్యాబ్ అరుదైన రికార్డు
- 24 గంటలూ వైద్యసేవలు
- మెదడు, కాళ్ల రక్తనాళాల పూడికలకూ వైద్యం



క్యాథ్‌ల్యాబ్ యంత్రం

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ గుండె జబ్బుల వైద్య విభాగం క్యాథ్‌ల్యాబ్ అరుదైన రికార్డు సొంతం చేసుకుంది. 25వేలకుపైగా చికిత్సలను పూర్తిచేసింది. ఇటీవల 100 గుండె బైపాస్ సర్జరీలు, 25వేల క్యాథ్‌ల్యాబ్ చికిత్సలు పూర్తిచేసినందుకు కార్డియాలజీ, కార్డియోథొరాసిక్ సర్జరీ వైద్యులను రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ గుంటూరు వైద్య కళాశాలలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్( ఐఎంఏ) ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రత్యేకంగా సత్కరించారు.

**కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా..**

గుంటూరు జీజీహెచ్ క్యాథ్‌ల్యాబ్ వైద్య విభాగంలో కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా వైద్యసేవలు అందుతున్నాయి. ఉచితంగా చికిత్స అందుతుండడంతో ఆరు జిల్లాలకు చెందిన రోగులు ఇక్కడికి తరలి వస్తుంటారు. 24 గంటలూ క్యాథ్‌ల్యాబ్ వైద్యసేవలు అందుబాటులో ఉంటున్నాయి.

**కేంద్ర ప్రాజెక్టులో భాగంగా ఏర్పాటు..**

విజయవాడకు చెందిన లక్ష్మీఆరుష్ హెల్త్‌కేర్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు పీపీపీ విధానంలో జీజీహెచ్‌లో క్యాథ్‌ల్యాబ్ మిషన్ ఏర్పాటుకు అనుమతిచ్చారు. కేంద్ర ప్రభుత్వ నీతి ఆయోగ్ ప్రాజెక్టులో భాగంగా ఏపీలో క్యాథ్‌ల్యాబ్‌ను తొలుత గుంటూరు జీజీహెచ్‌లో ఏర్పాటుచేసినట్లు సంస్థ ప్రతినిధి, కార్డియాలజిస్టు డాక్టర్ బొర్రా విజయ్‌చైతన్య తెలిపారు. 2018లో సుమారు రూ.4.5 కోట్లతో ఏర్పాటుచేసిన ఆధునిక క్యాథ్‌ల్యాబ్‌తో చికిత్స చేస్తే 50శాతం రేడియేషన్ తక్కువగా ఉంటుందని పేర్కొన్నారు. కచ్చితమైన ప్రదేశంలో స్టంట్‌ను అమర్చే సౌకర్యం క్యాథ్‌ల్యాబ్ ద్వారా ఉంటుందని వెల్లడించారు. ఇప్పటివరకు క్యాథ్‌ల్యాబ్ ద్వారా 25,000 మందికి చికిత్స చేశారు. తెల్ల రేషన్‌కార్డు, ఎన్టీఆర్ వైద్యసేవ కార్డు ఉన్నవారికి గుండె వైద్యసేవలన్నీ పూర్తి ఉచితంగా అందిస్తున్నారు. కార్డు లేనివారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఉచితంగా వైద్యసేవలు అందిస్తున్నారు.

### చికిత్సలన్నీ పూర్తి ఉచితం



జీజీహెచ్ క్యాథ్‌ల్యాబ్‌లో కార్డియాలజీ రోగులకు యాంజియోగ్రామ్, యాంజియోప్లాస్టీ, ఫేస్‌మేకర్ ఇతర అన్ని రకాల గుండె చికిత్సలు పూర్తి ఉచితంగా అందిస్తున్నాం. న్యూరో రేడియాలజీ వైద్యసేవలనూ అందుబాటులోకి తీసుకొచ్చాం. మెదుడు రక్తనాళాల్లో పూడికలు, కాళ్ళ రక్తనాళాల్లో ఏర్పడే పూడికలు తీసివేసి స్టంట్‌లు వేస్తున్నాం.

– డాక్టర్ బొర్రా విజయ్‌చైతన్య, సీనియర్ ఇంట్రవెన్షనల్ కార్డియాలజిస్ట్, క్యాథ్‌ల్యాబ్ నిర్వాహకులు

### కార్డియాలజీ విభాగం అభివృద్ధి



కార్డియాలజీ వైద్య విభాగాన్ని అభివృద్ధి చేశాం. ఇటీవల 100కుపైగా గుండె బైపాస్ సర్జరీలు చేసి రికార్డు సృష్టించాం. 25వేలకుపైగా క్యాథ్‌ల్యాబ్ చికిత్సలు పూర్తిచేశాం. అధికారులు, ప్రజాప్రతినిధులు, జింకానా, నాట్కో సంస్థ, ఇతర దాతల సహకారంతో ఆస్పత్రి అభివృద్ధికి కృషి చేస్తున్నాం.

– డాక్టర్ యశస్వి రమణ, జీజీహెచ్ సూపరింటెండెంట్

# శంకర్‌విలాస్ బ్రిడ్జిపై అపోహలొద్దు

- భవిష్యత్తు అవసరాల కోసం నిర్మాణం తప్పనిసరి
- ఎవరికీ ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నాం
- కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు వెస్ట్: శంకర్‌విలాస్ బ్రిడ్జి పునర్నిర్మాణంపై ఎవరికీ అపోహలు వద్దని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు, ఎస్పీ సతీష్‌కుమార్‌తో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ శంకర్ విలాస్ బ్రిడ్జికి సంబంధించి ఆర్‌యూబీ అంశాన్ని కూడా పరిశీలించామని పేర్కొన్నారు. భవిష్యత్తు అవసరాలరీత్యా ఆర్‌యూబీ స్థానంలో ఆర్వోబీకి మాత్రమే అవకాశం ఉందన్నారు. మొత్తం 900 మీటర్ల పొడవుతో స్థానిక ఏసీ కళాశాల నుంచి అరండల్‌పేట 9వ లైను వరకు ఈ బ్రిడ్జి నిర్మాణం కొనసాగుతోందన్నారు. దీనికి కేంద్ర ప్రభుత్వం రూ.98 కోట్లు ఇప్పటికే మంజూరు చేసిందని తెలిపారు. బ్రిడ్జి నిర్మాణంతోపాటు, అండర్‌పాస్‌లూ నిర్మిస్తామని పేర్కొన్నారు. మొత్తం బ్రిడ్జి నిర్మాణంతో 134 స్ట్రక్చర్లు ఎఫెక్ట్ అవుతాయని వివరించారు. ఇప్పటికే 40 మంది తమ అంగీకారం తెలిపారని, మరికొంత మంది కోర్టును ఆశ్రయించారని తెలిపారు. అయితే వారిని కూడా ఒప్పించే యత్నం చేస్తున్నామన్నారు. బ్రిడ్జి వల్ల ప్రభావితం అవుతున్న వారితో మూడు సమావేశాలు నిర్వహించామన్నారు. ఎప్పటికప్పుడు వారి అభిప్రాయాలు తీసుకుంటూ నిర్మాణ డిజైన్ చేపట్టామని పేర్కొన్నారు. బ్రిడ్జి తొమ్మిది మీటర్ల హైట్ ఉంటుందని పేర్కొన్నారు. కొందరు ఆరేడు మీటర్లు సరిపోతుంది కదా అని అంటున్నారని, అయితే ప్రస్తుతం రైళ్లన్నీ ఎలక్ట్రికల్ విధానంలో నడుస్తున్నాయని, వీటి ఎత్తు సుమారు 7 మీటర్లు ఎత్తు ఉంటుందని వెల్లడించారు. దీంతో తొమ్మిది మీటర్ల ఎత్తు నిర్మాణం తప్పనిసరని స్పష్టం చేశారు. నిర్మాణంతో నష్టపోయేవారికి చెల్లించే పరిహారం కూడా చట్టానికి లోబడి ఉంటుందని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. భవిష్యత్తు అవసరాల కోసం కొత్త బ్రిడ్జి నిర్మించకపోతే చాలా ఇబ్బందులు ఎదురవుతాయన్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

### ట్రాఫిక్‌ను నియంత్రిస్తాం : ఎస్పీ

సమావేశంలో ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ బ్రిడ్జి నిర్మాణం ప్రారంభమైన నాలుగు నెలల నుంచి ఆరు నెలల వరకు బ్రిడ్జిపై రాకపోకలు సాగించవచ్చని పేర్కొన్నారు. నిర్మాణానికి అన్ని ఏర్పాట్లు చేసుకున్న తరువాతే బ్రిడ్జిని పగులగొడతారని తెలిపారు. అమరావతి, గోరంట్ల నుంచి వచ్చే వాహనాలు ఇన్నర్‌రింగ్ రోడ్డువైపు మళ్లిస్తామన్నారు. వీలైనంత వరకు ట్రాఫిక్ సిబ్బందిని ఏర్పాటు చేసి, ఇబ్బందులు లేకుండా పటిష్ఠ చర్యలు తీసుకుంటామని వివరించారు. సమావేశంలో ఆర్ అండ్ బీ ఎస్ఈ శ్రీనివాసమూర్తి బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించిన అంశాలను ప్లాన్ ద్వారా వివరించారు.

# రంగస్థలం సర్వం సిద్ధం

### 4 నుంచి సుందరయ్య కళానిలయం నాటికల పోటీలు

యడ్లపాడు: గ్రామస్తులతో కలిసి కళామతల్లికి రెండు దశాబ్దాలకు పైగా సేవలు చేస్తున్నారు యడ్లపాడు పుచ్చలపల్లి సుందరయ్య కళానిలయం వారు. ఏటికేడు పోటీల నిర్వహణలో సరికొత్త ధోరణి అవలంభించడం విశేషం. పుచ్చలపల్లి సుందరయ్య కళానిలయంలో ఈ ఏడాది 22వ జాతీయ స్థాయి నాటికల పోటీల నిర్వహణకు రంగం సిద్ధమవుతోంది. ఈనెల 4,5,6 తేదీల్లో నాటికలు పోటీలు జరగనున్నాయి. ఇప్పటికే భారీ వాల్‌పోస్టర్లు, సోషల్‌మీడియా, ఇతర మాధ్యమాల రూపంలో ప్రచారం నిర్వహించారు.

- పోటీల్లో ఉత్తమంగా నిలిచిన ప్రథమ నాటికకు రూ.28వేలు, ద్వితీయ నాటికకు రూ.26వేలు తృతీయ నాటికకు రూ.24వేలు బహుమతి, అలాగే ప్రదర్శన పారితోషికం రూ.18వేలు, ప్రతి నాటిక రచయితకు రూ.వెయ్యి, ప్రతి నాటిక దర్శకుడికి రూ.వెయ్యి, ఐదుగురు ఉత్తమ నటీనటులకు రూ.వెయ్యి, మరో ఐదుగురు ఉత్తమ సహాయనటులకు రూ.500, ఉత్తమ దర్శకుడికి రూ.3వేలు, ఉత్తమ రచయితకు రూ.2వేలు, ఉత్తమ రంగాలంకరణ, సంగీత దర్శకులు, ఆహార్యం ఒక్కొక్కరికీ రూ.వెయ్యి ఆర్టిస్టులందరికీ జ్ఞాపికలు ఇవ్వనున్నారు. మహిళా కళాకారులకు ఆడపడుచు సత్కారం ప్రత్యేకం. రోజు పోటీలను వీక్షించేందుకు వచ్చిన ప్రేక్షకులకు అల్పాహార విందు, లక్కీడ్రా తీసి బహుమతులు అందించనున్నారు.

వాణిజ్యం

## నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో మంగళవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. **8,500** గరిష్ఠం : రూ. **11,000**

మోడల్ ధర రూ. **9,700**

## క్లుప్తంగా

### రైల్వే ఉద్యోగాల ఉచిత శిక్షణకు 5న ప్రవేశ పరీక్ష

**గుంటూరు ఎడ్యుకేషన్:** రైల్వే శాఖలో ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న అభ్యర్థులకు రామ్ కీ ఫౌండేషన్, పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్, లయన్స్ క్లబ్ ఆఫ్ గ్రీన్ ల్యాండ్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ అందించనున్నట్లు ఆయా సంస్థల ప్రతినిధులు ఎంవీ రామిరెడ్డి, గద్దె భాస్కర్, ప్రొఫెసర్ లక్ష్మీకుమారి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. రైల్వే రిక్రూట్మెంట్ బోర్డు గ్రూప్-డీ పరీక్షల ద్వారా వివిధ పోస్టులను భర్తీ చేయనున్న నేపథ్యంలో నిరుద్యోగ యువతకు ఇది మంచి అవకాశమని తెలిపారు. ఈనెల 5న రెండు రాష్ట్రాల్లోని వివిధ నగరాల్లో అర్హత పరీక్ష నిర్వహించి, ఎంపికైన అభ్యర్థులకు శ్రీధర్ సీసీఎఫ్ సంస్థ నేతృత్వంలో మూడు నుంచి నాలుగు నెలల పాటు హైదరాబాదులో ఉచిత శిక్షణ అందిస్తామని తెలిపారు. శిక్షణతోపాటు భోజన, వసతి సదుపాయాలతో పాటు స్టడీ మెటీరియల్ ఉచితంగా ఇస్తామన్నారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, విజయవాడ, కర్నూలు నగరాల్లో వంద మార్కులకు నిర్వహించే అర్హత పరీక్షను 90 నిమిషాల వ్యవధిలో రాయాల్సి ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్ టెలిగ్రామ్ గ్రూపును ఫాలో కావచ్చని, మరిన్ని వివరాలకు 9866 777 870 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

### పోలీస్ శాఖకు కారు బహూకరణ



**నగరంపాలెం(గుంటూరు వెస్ట్):** పోలీస్ శాఖ అందించే సేవల్లో దాతలు భాగస్వాములు కావాలని ఎస్పీ సతీష్ కుమార్ అన్నారు. నగరంపాలెంలోని జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో మంగళవారం ఎస్పీ సతీష్‌కుమార్‌కు కారు పత్రాలు, తాళాలను పయనీర్ ఆటోమొబైల్స్ అధినేత చుక్కపల్లి రమేష్ అందించారు. ఈ మేరకు దాతలైన పయనీర్ ఆటోమొబైల్స్ అధినేత చుక్కపల్లి రమేష్, చేబ్రోలు హనుమయ్య కుమారుడు చేబ్రోలు నరేంద్ర, భారతి కన్జ్యూమర్ కేర్ ప్రొడక్ట్స్ (ట్రిపుల్ ఎక్స్) అధినేత దివంగత మాణిక్యవేల్‌కు జిల్లా ఎస్పీ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో శిక్షణా ఐపీఎస్ అధికారిణి దీక్ష, జిల్లా ఏఎస్పీలు జీవీ.రమణమూర్తి (పరిపాలన), సుప్రజ (క్రైం), డీఎస్పీలు భానోదయ (దక్షిణ), ఏడుకొండలురెడ్డి (ఏఆర్), నల్లపాడు పీఎస్ సీఐ వంశీధర్, ఆర్‌ఐలు శ్రీహరిరెడ్డి, శివరామకృష్ణ పాల్గొన్నారు.

# స్థలం లేక అల్లాడుతున్నాం!

- రోడ్డుపైనే టెంట్ వేసి ప్రార్థనలు
- రాజధానిలో మైనార్టీల ఆవేదన
- ఈద్గాకు స్థలం కేటాయించాలని డిమాండ్
- సర్కారుకు విన్నవిస్తున్నా పట్టించుకోవడం లేదని ఆగ్రహం
- ఎమ్మెల్యేల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం శూన్యం



రాయపూడిలో రోడ్డుపైనే టెంట్ వేసి రంజాన్ వేడుకలు చేసుకుంటున్న ముస్లింలు

**తాడికొండ:** రాజధానిలో ఈద్గాకు స్థలం లేక పదేళ్లుగా మైనార్టీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేలాది ఎకరాలను పూలింగ్‌కు ఇచ్చిన ఈ ప్రాంతంలో ముస్లింలకు ఈద్గా స్థలం కావాలని అడుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పూలింగ్ సమయంలో సీఆర్డీఏ భూములు తీసుకునేప్పుడు తమ పరిస్థితి వివరిస్తే ఈద్గాకు స్థలం కేటాయించడమే కాకుండా మసీదు నిర్మిస్తామని అధికారులు హామీ ఇచ్చారని, అయితే ఇప్పుడు పూర్తిగా విస్మరించారని ముస్లింలు చెబుతున్నారు. పవిత్ర రంజాన్ రోజున కూడా ప్రార్థనలు చేసుకునేందుకు జానెడు జాగా లేక రోడ్డుపైనే టెంట్‌లు వేసి ప్రార్థనలు చేయాల్సిన దుస్థితి వచ్చిందని ఆవేదన చెందారు. ముస్లింలు అధికంగా ఉన్న రాయపూడి గ్రామంలో ఈద్గాకు స్థలం కేటాయించాలని పూలింగ్ సమయంలోనే నాటి ఎమ్మెల్యే, అధికారులు, సీఎంకు పలుమార్లు ముస్లింలు వినతిపత్రాలు అందజేశారు. అయితే ప్రభుత్వం పెడచెవిన పెట్టింది. తెలుగుదేశం పార్టీని నమ్మి ఓట్లేస్తే గతంలోనూ, ఇప్పుడూ తమను నట్టేట ముంచారని, సమస్యను ఎమ్మెల్యేకి వివరిస్తే ఇదిగో పరిష్కారం చేస్తామని చెబుతున్నారని, సీఎం దృష్టికి తీసుకెళ్లిన దాఖలాలే కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి స్థలం కేటాయించాలని డిమాండ్ చేస్తున్నారు.

### అడుగు ముందుకు పడడం లేదు



ఈద్గాకు స్థలం కేటాయించేందుకు అడుగు ముందుకు పడటం లేదు. గతంలోనూ, ఇప్పుడూ ఎమ్మెల్యేల దృష్టికి తీసుకెళ్లడమే తప్ప పట్టించుకునే నాథుడు లేడు. ప్రస్తుత ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ దృష్టికి సమస్యను తీసుకెళ్ళాం. ఈ సమస్యను సీఎం దృష్టికి ఆయన తీసుకెళ్లి ఉండకపోవచ్చని భావిస్తున్నాం. ఇకనైనా స్పందించి ముస్లింలకు న్యాయం చేస్తారని భావిస్తున్నాం

– షేక్ కరీముల్లా, రాయపూడి

### హామీ ఇచ్చి విస్మరించారు



గతంలో టీడీపీ అధికారంలో ఉండగా సీఆర్డీఏ పూలింగ్ ప్రక్రియ ద్వారా భూములు తీసుకునే సమయంలో ఈద్గాకు స్థలం కేటాయించడంతోపాటు మసీదు నిర్మాణం చేస్తామని ప్రభుత్వం, అధికారులు హామీ ఇచ్చారు కానీ ఆ తర్వాత విస్మరించారు. దీంతో ఇప్పుడు రోడ్డుపైనే నమాజ్ చేసుకోవాల్సి వస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలి. స్థలం కేటాయించాలి.

– సాహెబ్ జాన్, రాయపూడి

## జీవన సత్యాన్ని చాటిన 'జేబు చెప్పిన ఊసులు'

- ఆలోచింపజేసిన సాంఘిక నాటకం
- జాతీయస్థాయి నాటకోత్సవాలు ప్రారంభం
- విశాఖ నటి, రచయిత్రి, దర్శకురాలు విజయలక్ష్మికి ఎన్టీఆర్ జీవనసాఫల్య పురస్కారం



'జేబు చెప్పిన ఊసులు' నాటకంలో సన్నివేశం



కె.విజయలక్ష్మికి జీవనసాఫల్య పురస్కారం

**తెనాలి:** పట్టణానికి చెందిన డీఎల్ కాంతారావు పోస్టల్ ఉద్యోగుల కళాపరిషత్ ఆధ్వర్యంలో 14వ జాతీయస్థాయి నాటకోత్సవాలు మంగళవారం రాత్రి ఏడు గంటలకు ప్రారంభమయ్యాయి. స్థానిక కొత్తపేటలోని తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రమ్‌లో ఏర్పాటైన నాటకోత్సవాలను ప్రముఖ సినీ రచయిత డాక్టర్ సాయిమాధవ్ బుర్రా జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. తొలిరోజున సిరిమువ్వ కల్చరల్స్, హైదరాబాద్ వారి 'జేబు చెప్పిన ఊసులు' సాంఘిక నాటకాన్ని ప్రదర్శించారు. 'జేబు నిండుగా ఉంటే మనకు అందరూ ఉంటారు.. అదే జేబు ఖాళీ అయితే మనకోసం ఎవరూ ఉండరు.. జీవితం చివరి రోజుల్లో భరోసా ఉండదు' అనే నిజాన్ని అర్థవంతంగా చెప్పిందీ నాటకం. మన దగ్గర మనసుంది...మమకారం ఉంది.. వాటితోపాటు డబ్బును కూడా కాపాడుకోవాలనేది నాటక సందేశం. మనిషనేవాడు జాగ్రత్త పడుతూండాలి.. తనకోసం కూడా ఆలోచించుకోవాలి.. విలువైన డబ్బును తన కోసం కొంతయినా జాగ్రత్త చేసుకోవాలి.. ఆ డబ్బే చివరి దశలో ఆసరా అవుతుంది.. లేకుంటే జీవితంలో అభద్రత చోటుచేసుకుంటుంది.. జేబులు చెప్పే నిజాలను పట్టించుకోవాలంటూ 'జేబు చెప్పిన ఊసులు' నాటకం మనిషి ఎలా బతకాలో ఎలా బతకకూడదో తెలియచెప్పిన వాస్తవ ఘటనల సమాహారంగా ప్రేక్షకుల ప్రశంసలను అందుకుంది. స్నిగ్ధ రచించిన నాటకాన్ని మంజునాథ్ దర్శకత్వంలో ప్రదర్శించారు. ప్రధాన పాత్రల్లో ఎస్‌డీ బాషా, మంజునాథ్, ప్రశాంత్, మల్లాది భాస్కర్, ఆకెళ్ల గోపాలకృష్ణ, కె.శ్రీదేవి నటించారు. సంగీతం నాగరాజు, లైటింగ్ ఉమాశంకర్. నాటకం తదుపరి జరిగిన సభకు కళాపరిషత్ గౌరవాధ్యక్షుడు, ప్రముఖ రంగస్థల, సినీనటుడు నాయుడుగోపి అధ్యక్షత వహించారు. ఈ సభలో విశాఖపట్నానికి చెందిన ప్రముఖ రంగస్థల నటి, రచయిత్రి, దర్శకురాలు కె.విజయలక్ష్మికి ఎన్టీఆర్ జీవన సాఫల్య పురస్కారాన్ని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ చేతులమీదుగా ప్రదానం చేశారు. విశ్రాంత పోస్టల్ సూపరింటెండెంట్ కె.రమేష్, కళాపరిషత్ ప్రధాన కార్యదర్శి పీఎస్సార్ బ్రహ్మాచార్యులు, కోశాధికారి ఎ.పోతురాజు పాల్గొన్నారు.

### నేడు తుళ్ళూరులో రుణమేళా

**తాడికొండ:** తుళ్ళూరు మండల పరిషత్ కార్యాలయంలో వివిధ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు బుధవారం రుణమేళా నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కానూరి శిల్ప తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి నిర్వహించనున్న ఈ రుణమేళాకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు అప్లికేషన్, ఆధార్, రేషన్ కార్డు, ఇతర ధ్రువపత్రాలు, జిరాక్సులు తీసుకొని బ్యాంకర్ల ఎదుట హాజరు కావాలని ఆమె తెలిపారు.

### బాలుడిని చంపిన సవతి తల్లి, తండ్రికి రిమాండ్

**ఫిరంగిపురం:** బాలుడిని చంపిన కేసులో సవతి తల్లికి, తండ్రికి న్యాయమూర్తి రిమాండ్ విధించారు. పోలీసుల కథనం ప్రకారం.. కొండవీడు గ్రామానికి చెందిన కంచర్ల సాగర్, ఆయన రెండో భార్య లక్ష్మి ఫిరంగిపురం ప్రకాశం పంతులునగర్‌లో ఉంటున్నారు. మొదటి భార్య కుమారులైన కార్తీక్‌ను అడ్డు తొలగించుకోవాలని మార్చి 29న లక్ష్మి అతడిని కర్రతో కొట్టి గొంతుపిసికి చంపివేసింది. మరో కుమారుడు ఆకాష్‌ను పెనంపై కూర్చుపెట్టి వాతలు పెట్టింది. దీనికి భర్త సాగర్ సహకరించాడు. ఈ ఘటనపై పిల్లల మేనత్త విజయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ఈఘటనపై సీఐ రవీంద్రబాబు నిందితులు లక్ష్మి, సాగర్‌ను సోమవారం సాయంత్రం అరెస్టుచేశారు. నరసరావుపేట రెండో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వద్ద మంగళవారం హాజరుపర్చారు. వారికి ఈనెల 11 వరకు రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు.

## పోలీస్ గ్రౌండ్‌లో ఓపెన్ ఎయిర్ జిమ్ ప్రారంభం

**నగరంపాలెం(గుంటూరు వెస్ట్):** ఆహ్లాదకరమైన వాతావరణంలో నెలకొల్పిన ప్రకృతి వ్యాయామశాల (ఓపెన్ ఎయిర్‌జిమ్)ను ప్రజలు వినియోగించుకోవాలని ఎస్పీ సతీష్‌కుమార్ సతీమణి ధరణ్యసతీష్ అన్నారు. నగరంపాలెంలోని జిల్లా పోలీస్ కవాతు మైదానంలో ఏర్పాటుచేసిన ఓపెన్ ఎయిర్ జిమ్, చిన్నారుల క్రీడా పరికరాలను మంగళవారం ఆమె ప్రారంభించారు. ఎస్పీ సతీష్ కుమార్ మాట్లాడుతూ అనేక ఒత్తిళ్లు, ఉరుకులు పరుగులతో కూడిన మానవుని జీవితంలో వ్యాయామం తప్పనిసరి అని అన్నారు. నిత్యం వ్యాయామం చేస్తే ఆరోగ్యంగా ఉండొచ్చునని చెప్పారు. చిన్నారులు ఆడుకునేందుకు ఆటస్థలం ఉందని అన్నారు. వ్యాయామశాల ఏర్పాటుకు సహకరించిన సీసీ ఉప్పాల ఆదిశేషు, జిమ్ శిక్షకుడు కానిస్టేబుల్ శ్రీనివాసరావును ఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో శిక్షణా ఐపీఎస్ అధికారిణి దీక్ష, ఏఆర్ డీఎస్పీ ఏడుకొండలురెడ్డి, ఆర్‌ఐలు శ్రీహరిరెడ్డి, శివరామకృష్ణ, పోలీస్ అధికార, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రకృతి వ్యాయామశాలను ప్రారంభిస్తున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ సతీమణి ధరణ్యసతీష్

## 46 ఎకరాల గడ్డివాములు దగ్ధం

**తెనాలిరూరల్:** అగ్నిప్రమాదంలో సుమారు రూ.ఐదు లక్షల విలువైన 46 ఎకరాల వరిగడ్డి వాములు దగ్ధమైన ఘటన తెనాలి పినపాడు వద్ద మంగళవారం జరిగింది. బాధితుల కథనం ప్రకారం.. గుంటూరు జిల్లా పినపాడు ప్రాంతానికి చెందిన 13 మంది రైతులు ఉమ్మడిగా గడ్డివాములను వేశారు. 46 ఎకరాలు గడ్డిని 15 గడ్డివాములుగా ఏర్పాటు చేసుకున్నారు. మంగళవారం మధ్యాహ్నం ఆకస్మాత్తుగా మంటలు వ్యాపించి గడ్డివాములు తగలబడటం ప్రారంభించాయి. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందిచగా, సిబ్బంది మంటలను అదుపు చేసేందుకు తీవ్రంగా శ్రమించినా ఫలితం దక్కలేదు. గడ్డి వాములు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఎండ వేడికి దగ్ధమయాయా? లేక ఎవరైనా నిప్పు పెట్టారా? అన్న కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. రైతులు మాట్లాడుతూ గత కొన్నేళ్లగా ఇక్కడే గడ్డి వాములు వేస్తున్నామని, పంటలు నూర్చి గడ్డిని 13మంది రైతులము కలిసి ఒకచోట వాములు వేశామని, గడ్డికి ఎలా మంటలు వ్యాపించాయో తెలియదని చెప్పారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు ఆర్పిన లాభం లేకుండా పోయిందని, తమను ప్రభుత్వమే ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.



దగ్ధమవుతున్న గడ్డివాముల్లో కొంత భాగం

## వలస కూలీల ఆటోను ఢీకొన్న ప్రైవేటు బస్సు



ప్రమాదానికి కారణమైన కళాశాల బస్సు



తీవ్రంగా గాయపడిన వలస కూలీలు

నలుగురికి తీవ్ర గాయాలు

**మేడికొండూరు :** విషదళ సమీపంలోని ఎన్నారై కళాశాల వద్ద మంగళవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు వలస కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. మేడికొండూరు సీఐ నాగూర్ మీరా సాహెబ్ కథనం ప్రకారం.. కర్నూలు జిల్లాకు చెందిన కూలీలు మేడికొండూరు మండల పరిధిలోని సరిపుడి గ్రామంలో గుడారాలు నిర్మించుకొని నివసిస్తున్నారు. రోజూ కూలి పనుల కోసం పొన్నూరు వెళ్లి ఆటోలో తిరిగి వస్తున్నారు. మంగళవారం మధ్యాహ్నం కూడా తిరిగి వస్తుండగా మార్గమధ్యంలో పేరేచర్ల గ్రామ శివారు దాటిన తర్వాత ఎన్నారై కళాశాల సమీపంలో అతివేగంగా అజాగ్రత్తగా వస్తున్న ప్రైవేట్ బస్సు కూలీల ఆటోను వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో ఆటో ఒక్కసారిగా పల్టీ కొట్టి పక్కకు బోల్తా పడింది. ప్రమాదంలో తుపాకుల జయమ్మ, తుపాకుల సుబ్బారావు, మాణిక్యమ్మ, తుపాకుల లక్ష్మీనారాయణకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను 108 వాహనంతో చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మేడికొండూరు సిఐ నాగూర్ మీరా సాహెబ్ తెలిపారు.

**కళాశాల బస్సును దొంగిలించి ఆటోను ఢీకొట్టాడు**



ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి

వలస కూలీలను ఢీకొట్టి ఆపకుండా వెళ్లిన బస్సు వివరాలు సేకరించి దర్యాప్తు చేపట్టిన పోలీసులకు అది ఎన్నారై కళాశాలకు చెందిన బస్సుగా తెలిసింది. ఈ బస్సును పేరేచర్ల జంక్షన్ వద్ద ఆపి డ్రైవర్ మందులు కొనుక్కుంటుండగా గుర్తుతెలియని వ్యక్తి నడుపుకుంటూ తీసుకెళ్లిపోయాడు. దీంతో డ్రైవర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. డ్రైవర్ ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన మేడికొండూరు పోలీసులు పల్నాడు జిల్లా లిఖం కళాశాల సమీపంలో బస్సును అదుపులోకి తీసుకొని దొంగిలించిన వ్యక్తిని అరెస్టు చేశారు. బస్సు దొంగిలించిన వ్యక్తి జంగారెడ్డిగూడెం గ్రామానికి చెందిన పొన్నవోలు నాగేశ్వరరావు అని గుర్తించారు. నాగేశ్వరరావుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. ఈ కేసు గంట వ్యవధిలోనే పోలీసులు ఛేదించారు.

## ప్రాణం తీసిన ఈత సరదా

**పెదకాకాని:** స్నేహితులతో కలిసి గుంటూరు చానల్‌కు ఈత నేర్చుకునేందుకు వచ్చిన యువకుడు ప్రమాదవశాత్తూ నీట మునిగి మరణించిన ఘటన తక్కెళ్ళపాడులో జరిగింది. గుంటూరుకు చెందిన షేక్ జానీ(18) మరో ముగ్గురు స్నేహితులు మేకా వంశీ, లోకేష్‌కుమార్, మహబూబ్‌లతో కలసి ఈత నేర్చుకునేందుకు పెదకాకాని మండలంలోని తక్కెళ్ళపాడు సమీపంలో ప్రవహిస్తున్న గుంటూరు చానల్ వద్దకు చేరుకున్నాడు. కృష్ణానది నుంచి ప్రారంభమైన గుంటూరు చానల్(కొత్తకాలువ) మండలంలోని నంబూరు, పెదకాకాని, తక్కెళ్ళపాడు, రామచంద్రపాలెం గ్రామాల గుండా ప్రవహిస్తూ ఉంది. ప్రస్తుతం గుంటూరు చానల్‌లో నీటి ప్రవాహం ఉధృతంగా ఉంది. తక్కెళ్ళపాడు గ్రామంలోకి వెళ్ళే సమీపంలో కాలువలోకి దిగి ఈత కొడుతుండగా ఈత పూర్తిగా రాని షేక్ జాని నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో మునిగిపోయాడు. అదే సమయంలో అక్కడ సుమారు 30 మంది యువకులు ఈత కొడుతున్నారు. జాని నీటిలో మునగడంతో స్నేహితులు కేకలు వేశారు. దీంతో కొందరు నీటిలో మునిగిపోయిన జానీని వెతికి ఒడ్డుకు చేర్చారు. ఘటనా స్థలంలోనే ప్రథమ చికిత్స అందిస్తుండగా జానీ మరణించాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. మృతుడు జానీకి తల్లి వహీదా, చెల్లెలు సానియా, తమ్ముడు సైఫ్‌అలీ ఉన్నారు. తండ్రి కొంతకాలంగా కుటుంబాన్ని వదిలి దూరంగా ఉంటున్నాడు. జానీ గుంటూరులోని వస్త్రదుకాణంలో పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఘటనా స్థలానికి చేరుకున్న కుటుంబసభ్యులు జానీ మృతదేహాన్ని చూసి కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతదేహాన్ని అమ్మ చారిటబుల్ ట్రస్టు వారి వాహనంలో గుంటూరు మార్చురీకి తరలించారు. మృతుని తల్లి షేక్ వహీదా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ టి.పి.నారాయణస్వామి తెలిపారు.



గుంటూరు చానల్‌లో ఈత కొడుతూ నీట మునిగి మరణించిన షేక్ జానీ

### మద్యం మత్తులో వృద్ధుడి హత్య



**గుంటూరు రూరల్:** మద్యం మత్తులో వృద్ధుడిని హత్య చేసిన ఘటన రెడ్డిపాలెం సమీపంలో మంగళవారం జరిగింది. నల్లపాడు పోలీస్ స్టేషన్ సీఐ వంశీధర్ కథనం ప్రకారం శారదా కాలనీకి చెందిన దారావత్ రాము (60) ప్లాస్టిక్ బాటిళ్లు ఏరుకుని జీవిస్తుంటాడు. ఈ క్రమంలో రెడ్డిపాలెం వద్ద అదే గ్రామానికి చెందిన బట్టు రాజు అనే వ్యక్తితో కలిసి మంగళవారం మద్యం తాగాడు. ఈ సమయంలో వివాదం జరిగింది. దీంతో రాజు ఆవేశంలో మద్యం బాటిల్ పగలగొట్టి రాముపై దాడిచేశాడు. దాడిలో రాము తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటన విషయం తెలిసిన సౌత్ డివిజన్ డీఎస్పీ భానోదయ సిబ్బందితో కలిసి ఘటన స్థలికి చేరుకున్నారు. వివరాలను సేకరించిన సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు. నిందితుడు రాజును పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు.

## విజిబుల్ పోలీసింగ్‌తోనే ప్రజల్లో విశ్వాసం



నులకపేటలో విజిబుల్ పోలీసింగ్ నిర్వహిస్తున్న అడిషనల్ ఎస్పీ రవికుమార్

**తాడేపల్లి రూరల్:** విజిబుల్ పోలీసింగ్‌తో ప్రజలకు దగ్గరగా ఉన్నప్పుడు పోలీస్‌శాఖపై నమ్మకం పెరుగుతుందని గుంటూరు జిల్లా అడిషనల్ ఎస్పీ రవికుమార్ చెప్పారు. తాడేపల్లి రూరల్‌పరిధిలోని నులకపేటలో మంగళవారం రాత్రి విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు పారదర్శకంగా న్యాయం చేయాల్సిన బాధ్యత పోలీసులపై ఉందన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగినా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని స్థానికులకు సూచించారు. తాడేపల్లి సీఐ కల్యాణ్‌రాజు, ఎస్‌ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పౌరసరఫరాల గోదాము పరిశీలన

సాక్షి ఎఫెక్ట్



గోదామును తనిఖీ చేసి రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్‌ఓ పద్మ

**తాడికొండ:** తాడికొండ సివిల్ సప్లెస్ గోదాములో జరుగుతున్న గోల్‌మాల్ వ్యవహారంపై ఎట్టకేలకు సివిల్ సప్లెస్ అధికారులు స్పందించారు. 'రేషన్ బియ్యం సరఫరాలో గోల్‌మాల్' శీర్షికన మంగళవారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి డీఎస్‌ఓ పద్మ స్పందించారు. గోదామును తనిఖీ చేశారు. సరుకు వివరాలు, రిజిస్టర్‌ను పరిశీలించారు. డీలర్లకు తక్కువగా సరుకు వెళుతున్న విషయంపై హమాలీలు, గోదాము ఇన్‌చార్జిని ప్రశ్నించారు. వారు సరైన సమాధానం ఇవ్వకపోవడంతో ఆగ్రహించిన డీఎస్‌ఓ వివరణ ఇవ్వాలని ఆదేశించారు. అధికార పార్టీకి చెందిన డీలర్ ఎవరు? అతనికి సరుకు వెళుతుందా అని ప్రశ్నించగా సరైన సమాధానం రాలేదు. దీంతో ఆమె లిఖితపూర్వకంగా ఫిర్యాదు ఇవ్వాలని డీలర్లను కోరారు. ప్రతి బస్తాకు తమకు 600 గ్రాముల నుంచి కిలో వరకు తక్కువగా వస్తుందని, తూకం వేయకుండానే నేరుగా లోడింగ్ చేస్తున్నారని లిఖిత పూర్వకంగా డీలర్లు ఫిర్యాదు ఇచ్చారు.

## సదరం ధ్రువపత్రాలు కోసం 4 నుంచి శ్లాట్ బుకింగ్

**తాడికొండ:** దివ్యాంగులకు ప్రభుత్వం పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాటు చేసిన సదరం క్యాంపుల కోసం స్లాట్ బుకింగ్‌లు ఈనెల 4వ తేదీ నుంచి ప్రారంభం కానున్నట్లు తాడికొండ, తుళ్ళూరు ఎంపీడీవోలు కె.సమతావాణి, కానూరి శిల్ప ఒక ప్రకటనలో తెలిపారు. 4న ఉదయం 10 గంటల నుంచి గ్రామ/వార్డు సచివాలయాలు, మీ సేవా కేంద్రాల్లో సదరు నమోదు చేయించుకోవాలని వారు సూచించారు.

## అరండల్‌పేటలో యువకుడి హత్య!

**లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్):** అరండల్‌పేట 1వ లైన్‌లో నలుగురి మధ్య జరిగిన ఘర్షణ ఓ వ్యక్తి మరణానికి దారి తీసింది. ఈ ఘటన మంగళవారం అర్ధరాత్రి వెలుగులోకి వచ్చింది. అరండల్‌పేట పోలీసుల కథనం ప్రకారం.. వెంకటప్పయ్య కాలనీకి చెందిన గణేష్ (35)కి అరండల్‌పేటలో భిక్షాటన చేస్తూ మద్యం, గంజాయి తాగే మరో ముగ్గురితో స్నేహం కుదిరింది. ఈ నేపథ్యంలో ఒక స్నేహితుడి సోదరి పట్ల గణేష్ అసభ్యంగా ప్రవర్తించడంతో ముగ్గురూ కలిసి గణేష్‌పై దాడి చేశారు. ఈ ఘటన సాయంత్రం నాలుగు గంటల సమయంలో జరిగినట్లు పోలీసులు చెబుతున్నారు. అయితే మద్యం మత్తులో ఉన్న గణేష్‌ను తీవ్రంగా కొట్టడంతో వారి వద్ద నుంచి పారిపోయి దాక్కున్నాడు. అయితే గొంతు ఎండిపోయి అక్కడికక్కడే మరణించి ఉంటాడని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. స్థానికులు అరండల్‌పేట పోలీసులకు రాత్రి 11గంటలకు సమాచారం అందించడంతో వెస్ట్ డీఎస్పీ కె.అరవింద్, సీఐ వీరాస్వామి, సిబ్బందితో చేరుకుని మృతుడి వివరాలను సేకరించారు. మృతదేహాన్ని ప్రభుత్వ సమగ్రాస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడికి నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో సస్పెక్ట్ రౌడీషీట్ ఉన్నట్లు సమాచారం.